

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | శుక్రవారం 20, మార్చి 2026 | సంపుటి :16 సంచిక : 3 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00

# 22వ తేదీన 'రైతు భరోసా'



2 లో..

ఉగాది వేళ రైతులకు గుడ్ న్యూస్

రైతును 'రాజు'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యం

పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. మార్చి 22వ తేదీన 'రైతు భరోసా' పథకం కింద నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయ నున్నట్లు ప్రకటించారు. నేడు హైదరాబాద్‌లో జరిగిన 'శ్రీ పరాభవ నామ ఉగాది' వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త తెలుగు సంవత్సరాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేస్తున్నామని, వ్యవసాయాన్ని లాభసా టిగా మార్చి రైతును 'రాజు'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ కూడా అందిస్తున్నామని గుర్తుచేశారు.

## 'శ్రీ పరాభవ నామ సంవత్సరం'పై కిషన్ రెడ్డి ఆసక్తికర విశ్లేషణ

హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఉగాది శోభతో కళకళలాడింది. 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలుగు ప్రజలందరికీ నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండితులు వినిపించిన పంచాంగ శ్రవణం అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



వార్త 2లో

## నా పోరాటం ముగ్గురిపైనే: కవిత

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తన రాజకీయ అజెండాను స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. తన పోరాటం ఎవరితోనో కాదని.. "డాడీ (కేసీఆర్), మోడీ (పీఎం నరేంద్ర మోడీ), చిన్నమోడీ (కేటీఆర్)" లపైనేనని ఆమె సంచలన ప్రకటన చేశారు. బీఆర్ఎస్ పార్టీతో తనకు ఉన్న అంతర్గత విభేదాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నట్టు కవిత మండిపడ్డారు.



వార్త 2లో



## ఇరాన్ సముద్రగర్భ కేబుల్లను టార్గెట్ చేస్తే పరిస్థితి ఏంటి?

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న యుద్ధం ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థకు కొత్త ముప్పును తెచ్చిపెట్టింది. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో సముద్ర గర్భంలో ఉన్న ఇంటర్నెట్ ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవచ్చనే ఆందోళనలు ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమవుతున్నాయి.

వార్త 2లో




## మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు దుబ్బాక సమీపంలో గండి

వార్త 2లో

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ లో భారీగా గోల్డ్ సీజ్..

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. ఎయిర్‌పోర్ట్‌లో గురువారం డిఆర్ఐ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కోయంబత్తూరు నుంచి విశాఖ వెళ్తున్న ప్రయాణికుడి వద్ద అక్రమంగా తరలిస్తుండగా బంగారాన్ని గుర్తించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని బంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని సీఐఎస్ఎఫ్ పోలీసులకు అప్పగించారు. మార్కెట్ లో పట్టుబడిన బంగారం ధర దాదాపు రూ.కోటి విలువ ఉంటుందని అధికారులు తెలిపారు.ఇక, నిందితుడని అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించి విచారించనున్నట్లు సీఐఎస్ఎఫ్ పోలీసులు చెప్పారు.





2 లో..

## ఖతార్‌పై భీకర దాడి.. గ్యాస్ కేంద్రం ధ్వంసం.. భారత్‌కు ఇబ్బందులే..

## శ్రీరామ నవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు.. సిఎం రేవంత్ కు ఆహ్వానం

హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామ నవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ నెల 19 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు శ్రీరామ నవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 27 న భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా దేవాదాయ శాఖ ప్రతినిధులు, ఆలయ అర్చకులు ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఆలయ ఇఒ దామోదర్ రావు ఉన్నారు.



# ఇరాన్ సముద్రగర్భ కేబుళ్లను టార్గెట్ చేస్తే పరిస్థితి ఏంటి?

హైదరాబాద్,న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న యుద్ధం ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థకు కొత్త ముప్పును తెచ్చిపెట్టింది. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిలో సముద్ర గర్భంలో ఉన్న ఇంటర్నెట్ ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవచ్చనే ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్నాయి. ఇది వాస్తవరూపం దాల్చితే గ్లోబల్ ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి, ప్రపంచ దేశాలపై దాని ప్రభావం భారీగా ఉండే అవకాశం ఉంది.ఇప్పటికే యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధితో పాటు ఎర్ర సముద్రం కూడా వాణిజ్య నౌకల రాకపోకలకు మూసుకుపోయింది. మార్చి 3న ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ), హర్మూజ్‌ను దాటే ప్రయత్నం చేసే ఏ నౌకనైనా కాల్చివేస్తామని హెచ్చరించింది. మరోవైపు, ఇరాన్‌కు మద్దతుగా హూతీ మిలిటెంట్లు ఎర్ర సముద్రంలో దాడులను పునఃప్రారంభించడంతో రెండు ప్రధాన సముద్ర మార్గాలు యుద్ధ క్షేత్రాలుగా మారాయి.ప్రపంచ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో 95 శాతం సముద్రగర్భ కేబుళ్ల ద్వారానే నడుస్తుంది. ఆసియా, ఐరోపా, ఆఫ్రికాలను కలిపే 17 కీలక కేబుళ్లు ఒక్క ఎర్ర సముద్రం గుండానే వెళుతున్నాయి. అలాగే, హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే కేబుళ్లు ఇరాన్, ఇరాక్, కువైట్, బహ్రైన్, ఖతార్ వంటి దేశాలను గ్లోబల్ నెట్‌వర్క్‌తో అనుసంధానిస్తున్నాయి. భారతదేశ విదేశీ డేటా కనెక్టివిటీకి సైతం ఈ మార్గాలు అత్యంత కీలకం.ఈ పరిణామాలు టెక్ దిగ్గజాల ప్రణాళికలను దెబ్బతీసేలా ఉన్నాయి. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు గల్ఫ్ దేశాల్లో డేటా సెంటర్ల ఏర్పాటు కోసం బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టాయి. యూఏఈ, సౌదీ అరేబియాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌లుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇప్పుడు కేబుళ్లకు నష్టం వాటిల్లితే ఆ ప్రణాళికలు తలకిందులవుతాయి. ఈ కేబుళ్లు దెబ్బతింటే, వాటిని బాగు చేయడానికి ప్రత్యేక నౌకలు యుద్ధ ప్రాంతాలకు వెళ్లడం అసాధ్యం. దీంతో వారాలు, నెలల పాటు ఇంటర్నెట్ సేవలకు అంతరాయం తప్పదు. 2024లో హమాస్–ఇజ్రాయెల్ ఘర్షణల సమయంలో హూతీలు ఎర్ర సముద్రంలో కేబుళ్లపై దాడి చేసినప్పుడు ఇదే పరిస్థితి ఎదురైంది.ఇరాన్ ఇప్పటికే హర్మూజ్ జలసంధిలో సీమైన్లు (సముద్ర మందుపాతరలు) అమర్చినట్టు సమాచారం. తమ భూభాగంలో అమెరికా సైన్యానికి ఆశ్రయం ఇస్తున్నందుకు గల్ఫ్ దేశాల కేబుళ్లను కత్తిరిస్తామని ఇరాన్ హెచ్చరించినట్లు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో దాదాపు 17 శాతం ఈ మార్గాల గుండానే వెళుతుంది. ఈ నేపథ్యంలో గ్లోబల్ ఇంటర్నెట్ భవిష్యత్తుపై తీవ్ర అనిశ్చితి నెలకొంది.

# మార్చి 22వ తేదీన 'రైతు భరోసా'

హైదరాబాద్,న్యూస్‌వార్ ప్రతినిధి

ఉగాది వేళ రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. మార్చి 22వ తేదీన 'రైతు భరోసా' పథకం కింద నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించారు. నేడు హైదరాబాద్‌లో జరిగిన 'శ్రీ పరాభవ నామ ఉగాది' వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త తెలుగు సంవత్సరాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేస్తున్నామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును 'రాజు'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ కూడా అందిస్తున్నామని గుర్తుచేశారు. ఇప్పటికే రైతు భరోసా కింద రూ.18,000 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. రుణభారంతో ఉన్న రైతులకు పెద్ద ఊరటనిస్తూ రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. దేశంలోనే



అత్యంత తక్కువ రుణభారం ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని చెప్పడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 70 శాతం కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ధరణి పోర్టల్‌తో రైతులకు ఎదురైన భూ యాజమాన్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు దాని స్థానంలో 'భూ భారతి'ని తీసుకొచ్చామని రేవంత్ రెడ్డి వివరించారు. దేశంలోనే తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పునరుద్ఘాటించారు. ఈ ఉగాది పర్వదినం సందర్భంగా, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

# 'శ్రీ పరాభవ నామ సంవత్సరం'పై కిషన్ రెడ్డి ఆసక్తికర విశ్లేషణ

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఉగాది శోభతో కళకళలాడింది. 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలుగు ప్రజలందరికీ నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండితులు వినిపించిన పంచాంగ శ్రవణం అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.కొత్త ఏడాది పేరు 'పరాభవ' అని ఉండటంపై కిషన్‌రెడ్డి ఒక విభిన్నమైన విశ్లేషణ ఇచ్చారు. "పరాభవం అనే పదం మన దేశానికి కానీ, ధర్మాన్ని నమ్మే మన ప్రజలకు కానీ వర్తించదు. ఈ పరాభవం కేవలం భారతదేశ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు మాత్రమే ఎదురవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. పుణ్యభూమి అయిన భారతావనిలో ఈ ఏడాది శుభ ఫలితాలే రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.పండితులు వివరించిన పంచాంగం ప్రకారం... ఈ ఏడాది దేశ భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండుతాయని, రైతులు సుఖసంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో సతమతమవుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మాత్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని గుర్తు చేశారు.ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితానికి ప్రతీక అని, తీపి–వగరు–చేదు అన్నీ కలిస్తేనే జీవితమని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా, 140 కోట్ల మంది భారతీయులు ఐక్యంగా నిలబడితే ఏ సమస్యనైనా అధిగమించవచ్చని అన్నారు.

# మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు దుబ్బాక సమీపంలో గండి

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు గండిపడింది. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ గ్రామ సమీపంలో ఈ కాలువకు గండిపడింది. ఈ కాలువ మల్లన్నసాగర్ నుంచి దుబ్బాక ప్రాంతానికి నీరు అందిస్తుంది. కాలువకు గండిపడటంతో నీరు వృథాగా చెల్లాపూర్ కందూరు చెరువులోకి వెళుతోంది. సాగర్‌కు గండి పడటంతో కాలువ కింద పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గండిపడిన ప్రాంతాన్ని నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు.అధికారులను కలిసిన రైతులు, కాలువకు త్వరగా మరమ్మతులు చేయాలని లేదంటే పంటలు ఎండిపోతాయని విజ్ఞప్తి చేశారు. కాలువను సాధ్యమైనంత తొందరగా బాగుచేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. మల్లన్న సాగర్ నుంచి వచ్చే కెనాల్ కాలువ లైనింగ్ పనుల్లో క్వాలిటీ లేకపోవడం వల్ల కాల్వకు గండిపడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

# నా పోరాటం ముగ్గురిపైనే: కవిత

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తన రాజకీయ అజెండాను స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. తన పోరాటం ఎవరితోనో కాదని.. "డాడీ (కేసీఆర్), మోడీ (పీఎం నరేంద్ర మోడీ), చిన్నమోడీ (కేటీఆర్)" లపైనేనని ఆమె సంచలన ప్రకటన చేశారు. బీఆర్ఎస్ పార్టీతో తనకు ఉన్న అంతర్గత విభేదాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నట్టు కవిత మండిపడ్డారు. తన రాజకీయ ప్రయాణం స్వతంత్రంగా ఉంటుందని, ఎవరికీ అడ్వాంటేజ్‌గా మారబోనని ఆమె స్పష్టం చేశారు. "మంచి ముహూర్తం చూసుకుని పార్టీని ప్రారంభిస్తా.. అప్పుడే నా లక్ష్యాలను ప్రజల ముందు ఉంచుతాను" అని ఆమె అన్నారు.మరోవైపు, కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు నేడు సానుకూల తీర్పునిచ్చింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' (ప్రాజీ) పేరుతో దాఖలైన దరఖాస్తుపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. దీంతో పార్టీ అధికారిక ప్రకటనకు ఉన్న సాంకేతిక అడ్డంకులు దాదాపు తొలగిపోయినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఖతార్‌పై భీకర దాడి.. గ్యాస్ కేంద్రం ధ్వంసం.. భారత్‌కు ఇబ్బందులే..

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమాసియాలో యుద్ధం రోజురోజుకీ ఉధృతమవుతోంది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఈ యుద్ధ:లో ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే ఇరు దేశాల మధ్య పంతం చల్లారడం లేదు. తాజాగా తమ నేతలు లారిజానీ, నిఘా వ్యవహారాల మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్ మరణానికి ప్రతీకారంగా బుధవారం అర్ధరాత్రి ఇరాన్ కీలక గ్యాస్, చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేపట్టింది. ఖతార్‌లోని అత్యంత కీలకమైన రస్ లఫాన్ ఇండస్ట్రీయల్ సిటీపై ఇరాన్ క్షిపణితో దాడి చేసింది. ఇది ఖతార్ అర్థిక వ్యవస్థకు పునాది. దీంతో అత్యవసర బృందాలను రంగంలోకి దింపి మంటలను అదుపు చేయించే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ దాడిలో ఆ ప్రాంతం భారీస్థాయిలో దెబ్బ తిన్నట్లు ఆ దేశ వర్గాలు వెల్లడించాయి. చారిత్రక ప్రదేశాల పర్యటనలు అయితే తమ దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ఇలాంటి దాడులను ఉద్రిక్తతలను మరింత పెంచుతాయని ఖతార్ హెచ్చరికలు జారీ చేసింది. రస్ లఫాన్ ఇండస్ట్రీయల్ సిటీన దాడితో భారతపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఫర్టిలైజర్స్, సిఎన్‌జి, పిఎన్‌జి అవసరాల కోసం ఈ ప్రాంతంపైనే భారత్ ఆధారపడి ఉంది. భారత్ కొనుగోలు చేసే లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ 47 శాతం ఖతార్ నుంచే కొనుగోలు చేస్తుంది. ఆ దేశ ప్రభుత్వ రంగ సంస్థ ఖతార్ ఎనర్జీ స్పందిస్తూ.. ఇరాన్ క్షిపిణి దాడుల్లో పెద్ద సంఖ్యలో గ్యాస్ కేంద్రాల్లో నిప్పులు చెలరేగి దెబ్బతిన్నట్లు వెల్లడించింది. దీంతో భారత్‌లో నేచురల్ గ్యాస్ కష్టాలు పెరిగే అవకాశం ఉంది.

# కిమ్ పాలనలో కొత్త పరిణామం..

## దశాబ్దాల తర్వాత వ్యతిరేక ఓట్లను ప్రకటించిన ప్రభుత్వం

ఉత్తర కొరియాలో జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఎప్పటిలాగే అధికార వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా ఘన విజయం సాధించింది. ఈ నెల 15న జరిగిన ఈ ఎన్నికల్లో కిమ్ జోంగ్ ఉన్ నాయకత్వంలోని పార్టీ, దాని మిత్రపక్షాలు ఏకంగా 99.93 శాతం ఓట్లను కైవసం చేసుకున్నాయి. అయితే, ఈసారి ఫలితాల్లో ఒక అనూహ్యమైన, ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా అధికార అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓట్లు పోలైన విషయాన్ని ఆ దేశ ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది.ఉత్తర కొరియా 15వ సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ కోసం జరిగిన ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అన్ని స్థానాలనూ అధికార కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారు. దేశంలో నమోదైన ఓటర్లలో ఏకంగా 99.99 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇది ఒక రికార్డు అని ప్రభుత్వ మీడియా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (ఖజచీూ) ప్రకటించింది. విదేశాల్లో లేదా సముద్రంలో విధుల్లో ఉన్న కొద్దిమంది మాత్రమే ఓటు వేయలేదని తెలిపింది.

## ఆ 0.07 శాతం ఓట్లు ఎవరివి?

ఫలితాల ప్రకారం అధికార పార్టీకి అనుకూలంగా 99.93 శాతం ఓట్లు పోలయ్యాయి. మిగిలిన 0.07 శాతం ఓట్లు అధికార అభ్యర్థులను తిరస్కరిస్తూ పోలైన వ్యతిరేక ఓట్లు అని ప్రభుత్వం అంగీకరించింది. ఉత్తర కొరియా ఎన్నికల విధానంలో ప్రతిపక్షాలు పోటీ చేసే అవకాశం ఉండదు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం ముందుగానే ఆమోదించిన ఒకే ఒక్క అభ్యర్థి బరిలో ఉంటారు. ఓటర్లు ఆ అభ్యర్థికి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ఓటు వేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 0.07 శాతం మంది ఓటర్లు ప్రభుత్వ అభ్యర్థులను తిరస్కరించారు. 1957 తర్వాత ఇలా వ్యతిరేక ఓట్ల గురించి ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.ఈ ఎన్నికల ద్వారా మొత్తం 687 మంది ప్రతినిధులను ఎన్నుకున్నారు. వీరిలో కార్మికులు, రైతులు, మేధావులు, సైనికులు, అధికారులు ఉన్నారు. 2011లో తన తండ్రి కిమ్ జోంగ్ ఇల్ మరణానంతరం అధికారంలోకి వచ్చిన కిమ్ జోంగ్ ఉన్, 2019లో రాజ్యాంగ సవరణల ద్వారా తన అధికారాన్ని మరింత పటిష్ఠం చేసుకుని దేశాధినేతగా పూర్తి నియంత్రణ సాధించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు ముందుగానే ఊహించినవే అయినా, స్వల్పంగానైనా ఉన్న అసమ్మతిని ప్రభుత్వం అంగీకరించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

# వందేమాతరం పాడాల్సిందే.. ఎంఐఎంపై బండి సంజయ్ ఫైర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

అసెంబ్లీలో వందేమాతరం ఆలపించే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ దేశంలో ఉండేవారు ఎవరైనా జాతీయ గీతాన్ని గౌరవించి, వందేమాతరం పాడాల్సిందేనని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే వందేమాతరం గానాన్ని తప్పనిసరి చేస్తుందని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఐఎం నేతల తీరును ఆయన తీవ్రంగా ఖండించారు.సీఎం



రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన 'తొక్కుకుంట వచ్చిన' వ్యాఖ్యల వెనుక అంతర్గత రాజకీయాలు ఉన్నాయని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత రహస్యంగా మరో పార్టీతో సమావేశమైనందునే సీఎం ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా, కేరళ ఎన్నికల ఖర్చుల కోసం తెలంగాణ నుంచి నిధులు తరలిస్తున్నారని, ఈ బాధ్యతను రాహుల్ గాంధీ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికిని సంచలన ఆరోపణలు చేశారు.రైతు సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక సాయం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 22న ఇస్తామన్న రైతు భరోసాతో పాటు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసీ నది ప్రక్షాళనపై మాట్లాడుతూ, గుజరాత్‌లోని సబర్మతి నది తరహాలో అభివృద్ధి చేయడాన్ని స్వాగతిస్తామని, అయితే పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బాధితులకు సరైన నష్టపరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని సూచించారు.పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ తీసుకుంటున్న నిర్ణయాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, శాసనసభ, స్పీకర్ వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం ఓటు బ్యాంకు రాజకీయాలకు సీఎం, స్పీకర్ తలొగ్గుతున్నారని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతామని చెబుతూ, అసదుద్దీన్ ఓవైసీ నడిపే విద్యాసంస్థల్లో ఉగ్రవాద మూలాలు ఉన్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. అనంతరం హిందూ బంధువులందరికీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# గ్యాస్, చమురు నిల్వలు ఎంత ఉన్నాయో చెప్పండి: ఇంధన సంస్థలకు కేంద్రం ఆదేశాలు

దేశంలోని చమురు, గ్యాస్ కంపెనీల వద్ద ఉన్న నిల్వలు, ఉత్పత్తి, వినియోగం, దిగుమతులకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆయా కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దేశంలోని చమురు, గ్యాస్ కంపెనీలకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంధన కొరత ఆందోళన నెలకొంది. దేశంలో ఇంధన, గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పెట్రోల్, సహజవాయువు సరఫరా గొలుసును పర్యవేక్షించేందుకు ఒక కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేసే ఉద్దేశంతో ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా కంపెనీలు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ (పీపీఏసీ)కు ఈ వివరాలు అందించాలని సూచించింది.

న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# పండగల పరమార్థం సేవ

# స్వతంత్ర పాలస్తీనాతోనే!

మరుభూమిగా మారిన గాజాలో ఇప్పుడిప్పుడే ప్రశాంతత నెలకొంటోంది. గాజాలో కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల శాంతి ప్రణాళిక తొలి దశ అమలులోకి రావడంతో స్థానికుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఇరుపక్షాలు బందీలను విడిచిపెట్టడంతో వారి కుటుంబాలతోపాటు ప్రజల్లోనూ కొంత ఉపశమనం కనిపిస్తోంది. పాలస్తీనా భూభాగంపై పశ్చిమ దేశాల మద్దతుతో ఏర్పడిందే ఇజ్రాయిల్. 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గాజాపై అది పాల్పడిన బీభత్సం, విధ్వంసం ఈ శతాబ్దంలో మరెక్కడా చోటుచేసుకోలేదు. 67,682 మంది పాలస్తీనా వాసులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో చిన్నారులే 20,179 మంది. 28 వేల మంది మహిళలు, బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇంతటి మారణహోమానికి, విధ్వంసానికి పాల్పడిన ఇజ్రాయిల్‌కు ప్రధాన మద్దతుదారు అయిన ట్రంప్ శాంతి ప్రతిపాదన ఆధారంగానే హమాస్, ఇజ్రాయిల్ కాల్పుల విరమణకు అంగీకరించాయి. పరస్పరం బందీలను విడిచిపెట్టాయి. గాజా నుంచి కొంతవరకూ దళాలు వెనక్కి వస్తున్నాయి. అదే సమయంలో ఇజ్రాయిల్ తన పాత బుద్ధి చూపించుకుంది. తాజాగా, మరో తొమ్మిదిమంది పాలస్తీనియన్లను పొట్టనపెట్టుకోవడం దాని ఉన్మాదానికి నిదర్శనం. పాలస్తీనా ప్రజల సమస్య పరిష్కారమైతేనే గాజా, వెస్ట్‌బ్యాంక్‌లో ప్రశాంతత నెలకొంటుంది. 1967 నాటికి 78 శాతం భూభాగాన్ని ఆధీనంలోకి ఇజ్రాయిల్ తెచ్చుకుంది. కొత్తగా స్వాధీనం చేసుకున్న 22 శాతం భూభాగాన్ని ఖాళీ చేయాలని ఐరాస అనేక తీర్మానాలు చేసిన బుట్టదాఖలు చేసిన చరిత్ర టెల్ అవీవ్‌ది. పాలస్తీనా ప్రజలతో చర్చల అనంతరం 1993, 1995లో చేసుకున్న ఓస్లో ఒప్పందాల అమలుకూ మోకాలడ్డింది.


గత రెండేళ్ల మారణహోమంతో ఇజ్రాయిల్ రక్తపిపాసిగా ప్రపంచ ప్రజల మనసుల్లో ముద్రపడిపోయింది. అమెరికా సహా ప్రపంచ దేశాల్లో నిరసనలు పెల్లుబికాయి. ఇంతకాలం వత్తాసు పలికిన పశ్చిమ దేశాలుసైతం స్వతంత్ర పాలస్తీనా పల్లవి అందుకునేంతగా ఒత్తిడి పెరిగిపోయింది. మొదట పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానన్న ట్రంప్ అందువల్లే శాంతి



ప్రణాళిక పల్లవి అందుకున్నారు. ప్రణాళికలో పాలస్తీనా ప్రజల ఆకాంక్ష, ప్రపంచ ప్రజానీకం మద్దతు పొందిన స్వతంత్ర పాలస్తీనాకు ఎటువంటి ప్రాధాన్యత లేకపోవడం దారుణం. తాజా ప్రణాళికపై ప్రపంచ దేశాల నేతల సమక్షంలో ట్రంప్ ఆర్భాటంగా సంతకాలు చేసినా, ఇజ్రాయిల్ ప్రధాని సాకులు చెప్పి ఎగ్గొట్టారు. స్వతంత్ర పాలస్తీనాకు మోకాలడ్డుతున్న ఇజ్రాయిల్%ొ% తదుపరి ప్రణాళికలను ఎలా అమలు చేస్తుందో చూడాలి. హమాస్ ఇప్పటికీ ప్రజల్లోనే ఉంది. ఇజ్రాయిల్ వైఖరి చూస్తే దాని మారణహోమం ఆగినా, ముగియలేదనేది స్పష్టం. మధ్య ప్రాచ్యం అంతా ఇజ్రాయిల్ రేపిన మంటలే! తనపై దాడులపై ఖతార్ కన్నెర్ర చేయడంతో నెతన్యాహుతో ట్రంప్ క్షమాపణ చెప్పించాల్సి వచ్చింది. అమెరికాతో మిత్రదేశాలుగా ఉన్న ఇతర దేశాలు తమ భద్రతపై ఆందోళనతో ఉన్నాయి. 'ఆకాశం నిర్మలంగా ఉంది. తుపాకులు మూగబోయాయి. సైరన్లు ఆగిపోయాయి. ఎట్టకేలకు ప్రశాంతంగా ఉన్న పవిత్ర భూమిలో సూర్యుడు ఉదయించాడు'%ొ% అంటూ ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో ట్రంప్ చేసిన ప్రసంగాన్ని అక్కడి ఎంపీలే అడ్డుకున్నారు. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు చేయాల్సిందేనని ప్లకార్డులు చూపారు. ఇన్నేళ్లు రక్తపాతాన్ని స్పాన్సర్ చేసి ఇప్పుడు శాంతి వచనాలు చెబుతున్న ట్రంప్%ొ% ఇకనైనా పక్షపాతంతో కాకుండా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు బాటలు వేస్తేనే%ొ% శాంతి నెలకొంటుంది. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాల్లా%ొ% తుంగలో తొక్కకుండా ఇజ్రాయిల్‌ను అడ్డుకోవాల్సిన బాధ్యత అమెరికాదే. మరోసారి దూకుడుకు, దురాక్రమణకు పాల్పడకుండా నివారించేలా ఒత్తిడి చేయాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపైనా ఉంది. పాలస్తీనా భూభాగాల ఆక్రమణకు స్వస్తి చెప్పి, ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాలను అమలు చేయాల్సిన బాధ్యత ఇజ్రాయిల్‌ది. 1967కి ముందునాటి సరిహద్దుల ప్రాతిపదికన జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటైతేనే న్యాయమైన, శాశ్వతమైన శాంతి నెలకొంటుంది.

## జాగ్రత్తలు తీసుకుంటూ నడవాలి

తిరుపతి,




శ్రీ పరాభవ నామ సంవత్సరంలో వ్యక్తిగతంగానూ.. సామాజికంగానూ .. ఆలోచలను సక్రమంగా ఉంచే కాలమని పండితులు చెబుతున్నారు. మార్చి19న ప్రారంభమయ్యే పరాభవనామ సంవత్సరంలో ప్రతి విషయంలో స్పష్టత ఉండే అవకాశంఉంది. ఇంకా విద్యారంగంలో పెనుమార్పులకు అవకాశం.. సమాజ సేవ.. ఐకమత్యత మొదలగు విషయాల్లో గణనీయమైన ప్రభావం ఉంటుంది. ఆర్థిక పరంగా మెరుగైన ఫలితాల కోసం దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పండితులు అంటున్నారు. ఏ పండుగ అయినా.. వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు సమాజ శ్రేయస్సు కూడా ముఖ్యం. ప్రతి రోజు సమాజ సేవ చేయడానికి ఎవరికి అవకాశం ఉండదు. అందువలన కొత్త సంవత్సరం రోజు శ్రీ పరాభవ నామ సంవత్సరంలో సేవా సంకల్పంతో ముందడుగు వేసి.. విద్య, వైద్యం, పునరావాస సేవలకు మన వంతు సహకారం అందించి. .వికలాంగులకు..అనాథ పిల్లలకు.. పేదవారికి చేయూత నిచ్చి . వెలుగు అనే ఆశను నింపుదాం. . .. అసలైన పుణ్యకార్యంలో భాగస్వాములయి.. . సమాజానికి మనవంతు సేవ చేద్దాం. ఈ ఏడాది దేశ భవిష్యత్? ఎలా ఉంటుంది.. ఏ పండితుని పంచాంగ శ్రవణం వినాలి.. అనే విషయాల గురించి చర్చించుకుంటున్నారు.. కొత్త సంవత్సరం పరాభవనామ సంవత్సరం.. ప్రపంచానికి సవాళ్ల సంకేతమా.. అవమానాలు.. అపజయాలు ఎలా ఉంటాయి.. అన్న సంశయాలు ఉన్నాయి. జ్యోతిషశాస్త్రం ప్రకారం తెలుగు కొత్త సంవత్సరం శ్రీపరాభవ నామ సంవత్సరంలో రాజకీయంగా సంచలనాలు.. పెనుమార్పులు జరిగే అవకాశం ఉందిం. పలు దేశాల్లో రాజకీయ సంక్షోభానికి దారితీసే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. ఇక ఆర్థిక విషయాలను పరిశీలిస్తే అనేక విధాలుగా ఒడిదుడుకులు ఉండే అవకాశం ఉందని జ్యోతిష్య నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే రష్యా.. ఉక్రెయిన్? యుద్ధం నాలుగేళు ్లగా కొనసాగుతుంది. ఇప్పుడు ఓ పక్క అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు.. ఇరాన్ తో తలపడుతుంది. అటు కొన్ని దేశాలు.. ఇటు కొన్ని దేశాలు ఇప్పటికే తమ మద్దతును ప్రకటించాయి. హార్మోజ్ జలసంధి నుంచి అమెరికా యుద్ధ నౌకలు వెళ్లేందుకు చైనా అభ్యంతరం తెలిపింది. ఇదే బాటలో మరికొన్ని దేశాలు కూడా ఉన్నాయి. అమెరికా ఏమాత్రం వెనక్కుతగ్గడం లేదు. అక్కడ పరిస్థితి అలా ఉంటే పాకిస్థాన్?.. ఆఫ్ఘనిస్తాన్ కూడా ఒకరిపై మరొకరు బాంబులు విసురుకుంటున్నారు. ఈ పరిణామాలు పరాభవనామ సంవత్సరంలో ఇంకా పెచ్చే మీరే అవకాశాలతో పాటు .. ప్రపంచంలో ఆర్థిక పరిస్థితిలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఆటంకాలు, అవరోధాలు, సవాళ్లు, సమస్యలు, అవమానాలను సూచిస్తోంది. కొన్ని దేశాలకు అపజయాలు తప్పవంటున్నారు పండితులు.అంచనా వేస్తున్నారు. . వీటి ప్రభావం పాలకుల మీద, ప్రజల మీద తీవ్రస్థాయిలో ఉండబోతోందని చెబుతున్నారు జ్యోతిష్య పండితులు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉందని... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. పరాభవ నామ సంవత్సరమనే పేరు ముఖ్య ఉద్దేశం అహంకారాన్ని వదిలిపెట్టి జ్ఞానంతో, వినయంతో లోపాలను సరిదిద్దుకుని అధిగమించడం, పురోగతి చెందడమే అయినా.. ప్రజలు.. పాలకులు..తీసుకొనే నిర్ణయాలతో ప్రతికూల పరిణామాలు జరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనా కొత్త సంవత్సరంలో ఎవరికి వారు జాగ్రత్తగా ఉంటే విజయాలు, సాఫల్యాలను సాధించే అవకాశం కూడా ఉందని కూడా పండితులు చెబుతున్నారు.

## ఆత్మపరిశీలనతో అడుగు వేయాలి

### పరాభవంలో అప్రమత్తంగా ఉండాలి

విజయవాడ,

):తెలుగువారి నూతన సంవత్సరం పరాభవనామ సంవత్సరం. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం పరాభవం అంటే గర్వం.. అహంకారం.. స్వార్థం అని అర్థం. పండితులు తెలిపిన వివరాల ప్రకారం.. పరాభవం అంటే ఏమిటి.. కొత్త సంవత్సరం విశేషాలు.. రహస్యాలు ఏమిటి.. తెలుగు పంచాంగం ప్రకారం.. కొత్త సంవత్సరం.. పరాభవ నామ సంవత్సరం మార్చి 19న ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరం గురించి .. ఆధ్యాత్మికంగా పరిశీలించినట్లైతే.. ఇలాంటి వ్యతిరేక లక్షణాలను లక్షణాలను జయించి వినయం వైపు నడిపించే కాలాన్ని సూచిస్తుంది. ప్రతి వ్యక్తి తన లోపాలను గుర్తించి..వాటిని అధిగమించడానికి ప్రయత్నించే సంవత్సరమని పండితులు వివరిస్తున్నారు. పరాభవం అంటే ఏమిటి.. పురాణాల ప్రకారం తెలుగు కాలచక్రంలో 60 సంవత్సరాలు ఉంటాయి. ఈ చక్రంలో పరాభవ అనేది 40వ సంవత్సరం. సంస్కృతంలో ..పరాభవ.. అంటే ఓటమి.. అపజయం .. అవమానం అనే అర్థాలు ఉన్నాయి. కాని జ్యోతిష్యనిపుణులు , ఆధ్యాత్మిక పండితుల విశ్లేషణ ప్రకారం .. పరాభవ నామ సంవత్సరానికి లోతైన తాత్పర్యం ఉందని చెబుతున్నారు. కొత్త సంవత్సరం పేరులో ప్రతికూలత ఉన్నా కాని.. మనిషి జీవితంలో మార్పు, ఆత్మపరిశీలన, ఆత్మవికాసాన్ని సూచించేందుకు ఒక సంకేతమని చెబుతున్నారు. అహంకారంపై విజయం : కొత్త సవంత్సరం.. పరాభవ నామ సంవత్సరం పేరు ఆధారంగా స్వార్థం.. అహంకారం.. గర్వం.. మొదలగు చెడు లక్షణాలను వదలి.. మంచిగా.. అందరి మన్నలు పొందేలా ఈ తెలుగు సంవత్సరం ( పరాభవ) సూచిస్తుందని పండితులు చెబుతున్నారు.ప్రతి వ్యక్తి తనలోని లోపాలను గుర్తించి.. వాటిని అధికమించేందుకు ఈ ఏడాది ప్రయత్నించే దశ అని పండితులు చెబుతున్నారు. తెలుగు సంవత్సరం పరాభవ నామ సంవత్సరం.. ప్రతి మనిషి తన గత అనుభవాలు... తప్పులు... విజయాల గురించి ఆలోచించి... వాటి నుంచి పాఠాలు నేర్చుకునే సమయంగా భావిస్తారు. ఇది వ్యక్తిత్వ వికాసానికి దారితీసే ఒక ఆత్మపరిశీలనా దశను సూచిస్తుంది. ప్రతి వ్యక్తికి కూడా కొంతమంది శత్రువులు ఉంటారు. పలు ఆధ్యాత్మిక గ్రంథాల్లో చెప్పిన విధంగా అరిషడ్వర్గాలు.. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు.. మనిషి ఎదుగుదలను అడ్డుకోవడం.. శత్రువులను పెంచే అంతర్గత శత్రువులు ఉంటారు. పరాభవ నామ సంవత్సరంలో ఇలాంటి ఎనిమీస్?పై విజయం సాధించి.. ధర్మబద్దంగా జీవితం గడిపేందుకు ఒక సూచన అని పండితులు చెబుతున్నారు. తెలుగు పంచాంగ చక్రం ప్రతి 60 సంవత్సరాలకు ఒకసారి పునరావృతమవుతుంది. తెలుగు కాలచక్రంలోని 60 సంవత్సరాలను పండితులు మూడు భాగాలుగా విభజిస్తారు. ఈ 60 సంవత్సరాలను బ్రహ్మ, విష్ణు, శివ విభాగాలుగా చెప్పబడతాయి. ఈ విభాగాలలో పరాభవ సంవత్సరం విష్ణువుకు కేటాయించిన రెండవ విభాగంలో చివరి సంవత్సరమని పండితులు చెబుతున్నారు. కొత్త సంవత్సరం పేరు వినడానికి ప్రతికూలంగా అనిపించినప్పటికీ.. పరాభవ అనే పదాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. ఓటమి కాదు.. అది మన లోపాలను గుర్తించి.. అలాంటి వాటిని జయించే మార్గాన్ని సూచిస్తుందని అంటున్నారు జ్యోతిష్య పండితులు . ప్రతి మనిషిలో కూడా ఎంతో కొంత అహంకారం ఉంటుంది. దానిని తగ్గించి...ఆత్మపరిశీలన చేసుకొని.... సత్యంగా..ధర్మంగా ఉండి ముందుకు సాగాలని సూచించే ఒక ఆధ్యాత్మిక సందేశాన్ని ఈ సంవత్సరం ప్రతిబింబిస్తుందని పండితులు చెబుతున్నారు.

## జిల్లా బిజెపి కార్యాలయాల్లో ఉగాది వేడుకలు

### పార్టీ శ్రేణులకు అధ్యక్షుడు మాధవ్ సూచన

అమరావతి,

ఉగాది పర్వదినం సందర్భంగా పార్టీ శ్రేణులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దిశానిర్దేశర చేశారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా నేతలు, కార్యకర్తలతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని బీజేపీ కార్యాలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యాలయంలో పురోహితులను పిలిపించి పూజా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పంచాంగ శ్రవణం తప్పనిసరిగా జరగాలని ఆయన ఆదేశించారు. ప్రతి జిల్లాలోని ముఖ్యమైన గ్రామ దేవతలను పార్టీ నాయకులు సందర్శించాలని మాధవ్ సూచించారు. గ్రామ దేవతలకు పార్టీ తరఫున సంప్రదాయబద్ధంగా సారె సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి స్థానిక ప్రజలతో కలిసి ఈ వేడుకలు జరపాలని ఆదేశించారు. కొత్త అమావాస్య, ఉగాది సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాలను పార్టీ శ్రేణులు.. ప్రజలతో మమేకమై చేయాలని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## ప్రేమించి పెళ్లి చేసుకుని..ప్రాణం తీసిన భర్త

### నాలుగు నెలల గర్భిణిని హతమార్చి పరార్

జగిత్యల,

జగిత్యాల జిల్లాలో దారుణం జరిగింది. నాలుగు నెలల గర్భవతిగా ఉన్న భార్యపై భర్త కత్తితో దాడి చేసి చంపాడు. కోరుట్ల మండలం మాదాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ప్రాథమికంగా తెలిపిన వివరాల ప్రకారం.. 8 నెలల క్రితం కోరుట్లకు చెందిన చిత్తరి హరిబాబు, మాదాపూర్‌కు చెందిన వైష్ణవి (19) ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి అతను మాదాపూర్‌లోనే నివాసముంటున్నారు. హరిబాబు ప్రభుత్వ ఆస్పత్రిలో ఒప్పంద పద్ధతిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వైష్ణవి రీల్స్ చేస్తూ యూట్యూబ్ ఛానల్ నడిపిస్తోంది. గత కొద్దిరోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం వేకువజామున 4 గంటలకు వైష్ణవిపై హరిబాబు కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం కుటుంబసభ్యులు చూసేసరికి రక్తపుమడుగులో వైష్ణవి పడి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా

### అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు

నాగర్‌కర్నూల్

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముందు ఆశ కార్యకర్తలు ధర్నాకు దిగారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అయితే ధర్నా చేస్తున్న ఆశలను పోలీసులు అరెస్టు చేశారు. వారిని బలవంతంగా పోలీస్ వ్యాన్‌లో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్త వాతారణం నెలకొంది. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ తమకు అనేక హామీలను ఇచ్చిందని.. కానీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తమ సమస్యల పరిష్కారానికై కలెక్టర్ కార్యాలయం ఎదుట 48 గంటల ధర్నాకు పూనుకున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఈ ధర్నా చేపట్టగా.. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. మంగళవారం సైతం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగగా.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

## కూకట్‌పల్లి కోటి రూపాయల దోపిడీ ఘటన

### కళ్లల్లో కారం చల్లి దోచుకున్న దుండగులు

### వివరాల ఆధారంగా రంగంలోకి పోలీసులు

హైదరాబాద్,

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో భారీ దోపిడీ కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. సోమవారం రాత్రి సుమారు 9:40 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో స్కూటీపై డబ్బులు తరలిస్తున్న ఇద్దరిపై దుండగులు దాడి చేసి కోటి రూపాయల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పిలర్ నెంబర్ 825 సమీపంలో, ఏసీపీ కార్యాలయం పక్కనే జరగడం మరింత సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం మహ్మద్ ఖుస్రూ (42), మహ్మద్ అజీముద్దీన్ (38) అనే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై కోటి రూపాయల నగదును తరలిస్తున్నారు. వీరు బహదూర్‌పురాకు చెందిన ఏసీ మెకానిక్స్. అనుమానం రాకుండా ఉండేందుకు గోల్డ్ డ్రాప్ కార్టన్ బాక్స్‌లో కోటి రూపాయలను పెట్టుకుని బైక్‌పై తరలించే ప్రయత్నం చేశారు. కూకట్‌పల్లి పిల్లర్ నెంబర్ 825 వద్ద ఏజెంట్లు డబ్బు కలెక్ట్ చేసుకున్నారు. అయితే వీరిని ముందుగానే గమనించిన దుండగులు మూడు బైక్‌లపై ఫాలో అయ్యారు. డబ్బు కలెక్ట్ చేసుకుని కేవలం 100 మీటర్ల దూరం ప్రయాణించగానే.. నలుగురు దుండగులు స్కూటీపై వెళ్తున్న వారిపై కారం పొడి చల్లి దాడి చేశారు. దీంతో బాధితులు కింద పడిపోగా.. వెంటనే నగదు ఉన్న బాక్స్‌ను తీసుకుని దుండగులు పరారయ్యారు. ఈ ఘటనలో ఉపయోగించిన బైక్‌లు ప్యాషన్ ప్లస్, ఎఫ్‌జెడ్ మోడల్స్‌గా పోలీసులు గుర్తించారు. డబ్బు హవాలా నగదై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాగే డబ్బు తరలింపు సమాచారం ముందుగానే తెలిసిన వ్యక్తులే ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన అనంతరం పోలీసులు బాధితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరిది? వంటి వివరాలను సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో నగరంలో భద్రతా వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక



## ఉగాది పచ్చడి పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



మందమర్రి మార్కెట్ లో కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, భక్షాల పంపిణీ. మందమర్రి పట్టణ మార్కెట్ ఏరియా లో శ్రీ పరాభవ నామ సంవత్సర తెలుగువారి తొలి ఉగాది పండుగ సందర్భంగా మందమర్రి పట్టణ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఉగాది పచ్చడి, భక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సోతుకు సుదర్శన్, మందమర్రి సిఐ పర్స రమేష్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు తెలుగువారి తొలి ఉగాది పండుగ శ్రీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం ప్రజలందరూ సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని అన్నారు. పట్టణ ప్రజలు ఉగాది పండుగ లాగానే మిగతా పండుగలు కూడా శాంతియుత వాతావరణం లో ఆనంద ఉత్సాహాల మధ్య జరుపుకోవాలని సిఐ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై నరేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గ్రామ 7వ వార్డు సభ్యురాలు వేల్పుల మహేశ్వరి ఆధ్వర్యంలో గ్రామ మహిళలు గ్రామంలోని పోచమ్మ తల్లి తో పాటు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు నీళ్లతో అభిషేకాలు చేసి, చల్లగా కాపాడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ, ముందుగా గ్రామ ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు సంవత్సరాది మొదటి రోజైన ఉగాదిని పురస్కరించుకొని గ్రామాన్ని కాచే గ్రామ దేవతలను కొలుస్తూ, నూతన సంవత్సరాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరంలో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మ వార్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## కామ్రేడ్ మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో నేటి యువతరం సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరవనిత కామ్రేడ్ మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో నేటి యువతరం సమాజంలోని ఆర్థిక దోపిడి, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ చుక్క రాములు యువతకు పిలుపునిచ్చారు. గురువారం రోజున సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కార్మిక కర్షక భవనంలో మల్లు స్వరాజ్యం గారి 4వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు గారు మాట్లాడుతూ నేడు అధికారంలో ఉన్న పాలకులు అసమానతలు పెంచుతూ ఆర్థిక దోపిడికి గురి చేస్తున్నారని సామాన్యులకు సౌకర్యాలు అందుబాటులో లేకుండా చేస్తూ పేదవాడిని మరింత పేదవాడిగా దిగజార్చే విధంగా ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశమైన అమెరికా తన ఆధిపత్యం కోసం స్వతంత్ర దేశాలపై ఆధిపత్యం కోసం పరితపిస్తుంది. ఈ తరుణంలో జరుగుతున్న ఇరాన్ పై యుద్ధం చేస్తుంటే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కు మోకరిల్లుతూ మన దేశ అలీన విధానానికి తూట్లు పొడుస్తూ మిత్ర దేశమైన ఇరాన్ పై దాడి చేస్తుంటే జోక్యం చేసుకొని ప్రపంచ శాంతికి మన మోడీ యుద్ధాన్ని ఆపే విధంగ ఎలాంటి ప్రయత్నాలు చేయకపోగా యుద్ధం వల్ల వచ్చిన గ్యాస్ సంక్షోభాన్ని ముందస్తు చూపు లేకపోవడంతో దేశంలోని ప్రజలు అవస్థలు పడుతున్నారని పైగా ఎక్కడ కూడా గ్యాస్ కొరత లేదంటూ బిజెపి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదే అదునుగా చూసుకొని మార్కెట్ లో అదనంగా డబ్బులు దండుకొని గ్యాస్ కంపెనీలు పేదవాళ్ళని దోచుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా గ్యాస్ సంక్షోభంతో తలెత్తిన ఆర్థిక వ్యవస్థలోనీ అసమానతలు నివారించడంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వారన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకుని ప్రజల ఆటంకంగా ఉన్న గ్యాస్ వెంటనే సరిపడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దున్నే వాడికి భూమి కావాలని అసమానతలు పోవాలని పోరాటం చేసిన యువత అగ్రభాగాన నిలిచిందని అందులోని నుండి పుట్టిన మాణిక్యమే మల్లు స్వరాజ్యం అని అలాంటి వీరవనిత స్ఫూర్తితో నేడు యువత సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమానతలను లేని సమాజం నిర్మాణ కోసం పోరాటంలోకి రావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుపర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు బత్తుల అభిషేక్ బాన్ తదితరులు పాల్గొన్నారు.

# మర్రిగూడ లో ఉగాది ఉత్సవం

న్యూస్‌వార్ ప్రతినిధి



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈరోజు ఉగాది ఉత్సవం గుమ్మకొండ ఫంక్షన్ హాల్లో వేడుకగా జరిగింది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ వ్యవస్థాపకులైన డాక్టర్ జి జన్మదినోత్సవం సందర్భంగా స్వయం సేవకులు మొదటగా ఆధ్య సర్ సంఘ్ ఛాలక్ ప్రణామ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ లోకనాద్ శర్మగారు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ హిందూ జాతిని జాగ్రత్త పరుస్తూ సమాజంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదించుకుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన జిల్లా శారీరక్ ప్రముక్ వనం రమేష్ జి మాట్లాడుతూ ఉగాది ప్రకృతిని వసంత శోభతో నింపుతూ మనల్ని నూతన సంవత్సరంలోకి తీసుకు వెళుతుందని ప్రతి వ్యక్తి కొత్త ఆలోచనలతో క్రొత్త నిర్ణయాలతో నూతన సంవత్సరంలోకి అడిగిడి జీవితాన్ని శోభాయమానంగా మలచుకోవడానికి ప్రయత్నిస్తుంటారని తెలియజేశారు ఈ సందర్భంగా ప్రతి వ్యక్తి కూడా తన జీవితంలో కొంత సమయాన్ని ఈ సమాజానికి కేటాయించి సమాజాన్ని ఉన్నత స్థితిలోకి తిసుకొని వెళ్ళాలని పిలుపునిచ్చారు. ఈ పని కేవలం ఆర్ఎస్ఎస్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని కాబట్టి ప్రతి వ్యక్తి సంఘ కార్యక్రమాల్లో పాల్గొని సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నించాలని కోరారు ఈ సంఘాన్ని స్థాపించినటువంటి డాక్టర్ జి ఉగాది రోజునే జన్మించారని తెలియజేశారు 1925లో డాక్టర్ జి ఆర్ ఎస్ ఎస్ సంఘాన్ని స్థాపించిన నాటికి వారు వైద్య వృత్తిలో పట్టాపుచ్చుకొని ఉన్నారని తెలియజేశారు. ఆ రోజుల్లో డాక్టర్ జి సమాజం గురించి కాకుండా స్వార్థంగా ఆలోచించినట్టయితే డాక్టర్ గా ఎంతో ఆర్థిక పురోగతిని సాధించేవారు కానీ డాక్టర్ జి సమాజం కోసం తన జీవితాన్ని మొత్తం వెచ్చించి హిందూ జాగృతి కోసం పాటుపడ్డారని తెలియజేశారు వారు స్థాపించిన సంఘం అంచలంచలుగా ఎదిగి ఈరోజు 54 దేశాల్లో శాఖలను కలిగి ఉందంటూ ఈ సంవత్సరం సంఘం శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్నదని తెలిపారు ఈ దేశంలో ఎన్నో సంస్థలు ఏర్పడ్డప్పటికీ కూడా 100 సంవత్సరాలుగా నిలిచి ఉన్నటువంటి ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ మాత్రమేనని తెలియజేశారు ఈ సందర్భంగా హాజరైనటువంటి మర్రిగూడ గ్రామ ప్రజలందరూ సామూహికంగా ఉగాది పండుగ నిర్వహించుకుని ఉగాది పచ్చడిని పంచుకోవడం జరిగింది.

# రండి కంటి ఆపరేషన్ చేపిస్తాం

### నాగం, గొంగడిలకు కోడి శ్రీనివాస్ పిలుపు

న్యూస్ వార్ ప్రతినిధి చండూర్



వ్యక్తుల మధ్యన జరిగిన గొడవను పార్టీలకు వృద్ధి రాద్ధాంతం చేస్తున్న బిజెపి నాయకులైన జిల్లా అధ్యక్షులు నాగ వర్షిత్ రెడ్డికి రాష్ట్ర నాయకులైన గొంగిడి మనోహర్ రెడ్డి గారికి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా కంటి ఆపరేషన్ చేయిస్తామని అప్పుడైనా జరిగిన వాస్తవం ఏమిటో వాళ్లకు కనపడుతుందని ఈరోజు స్థానిక రహదారి బంగ్లాలో జరిగిన ప్రెస్ మీట్ లో చండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ కోడి శ్రీనివాస్ అన్నారు. చండూరులో అన్ని పార్టీల వారు ఉన్నప్పటికిని నేటి వరకు శాంతి భద్రతలకు విఘాతం కలిగే చర్యలు ఎప్పుడూ జరగలేదని తెలియజేశారు. ఈ గొడవలో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఉన్నప్పటికిని బిజెపికి టిఆర్ఎస్ కు ఉన్న లోపాయ కారి ఒప్పందాలు, సంబంధాల వలన బిజెపి నాయకులు కేవలం కాంగ్రెస్ పైననే బురద జల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరించడం శోచనీయమని అన్నారు. త్వరలోనే అన్ని పార్టీల నాయకులను సమన్వయ పరిచే తిరిగి చండూరులో ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేస్తానని తెలియజేశారు

# బిఆర్ఎస్ పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

### బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు

పట్టణంలోని పాత బస్టాండ్ జయశంకర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జే రవీందర్ ఆధ్వర్యంలో పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ తోపాటు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉగాది పండుగ సందర్భంగా ఉగాది పచ్చడి, భక్షాలను పంపిణీ చేశారు. అనంతరం పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్ - 2026 ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జే రవీందర్ మాట్లాడుతూ, ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని భగవంతుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో టిబిజికేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఓ రాజశేఖర్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ఇంచార్జ్ బత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బండారి సూరిబాబు, పార్టీ నాయకులు ఎండి అబ్బాస్, మద్ది శంకర్, కొంగల తిరుపతిరెడ్డి, బోరిగం వెంకటేష్, బర్ల సదానందం, మేడిపల్లి మల్లేష్, కనకం రవి, భూపెల్లి కనకయ్య, నల్వాల సమ్మయ్య, పల్లె నర్సింగ్, పూసల ఓదెలు, దాసరి రాజనర్సు, కొండల్ రావు, శివ నాయక్, శేఖర్ యాదవ్, మొగరం శ్రీనివాస్, వోద్దాం సాగర్, రవి వర్మ, ఎండి మజర్, తొగరి వెంకన్న, లింగమూర్తి, కోడం శ్రీనివాస్, యువజన నాయకులు బట్టు రాజ్ కుమార్, తోట సురేందర్, ఎండి ముస్తఫా, మారం రామకృష్ణ, దాసరి నవీన్, సీపెల్లి సాగర్, మాసు వెంకటేష్, అఖిలేష్ పాండే, కంది తిరుపతి, ముల్కల్ల రమేష్, కుమార్, సంగతి సంతోష్, బెల్లం అరుణ్, కంపెల్లి సుధాకర్, శనిగారపు అరుణ్, రాజేష్, ఎండి సెన్ను, మహిళా నాయకురాలు అమృత, తోకల నిరోషా, అమృత రమాదేవి, చిప్పకుర్తి రేఖ, వెంకటలక్ష్మి, శారద, వరలక్ష్మి, దారావత్ లావణ్య, ఎనగందుల లక్ష్మి, ఈశ్వరి, మాధవి, రజిత, రమాదేవి లు పాల్గొన్నారు.



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,